క్లుప్తంగా

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ రికవరీ



సెల్‌ఫోన్ అందజేస్తున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ సహకారంతో పోలీసులు రికవరీ చేశారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేశారు. పట్టణ సీఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ వెబ్‌సైట్ సహకారంతో ఫోన్ ఆచూకీ గుర్తించవచ్చని చెప్పారు. పట్టణంలో నవీన్‌కుమార్ అనే వ్యక్తి శనివారం తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన క్రైం బ్రాంచ్ పోలీసులు సీఈఐఆర్ యాప్ సహకారంతో చోరీకి గురైన ఫోన్ ఆచూకీ కనుగొన్నారు. చాలా తక్కువ సమయంలో అపహరణకు గురైన సెల్‌ఫోన్‌ను గుర్తించినట్లు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్: ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లబ్ధిదారుడికి అందజేశారు. మండలంలోని కొండన్నగూడకు చెందిన బలమోని వంశీ యాదవ్ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోకి చికిత్సపొందుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగులకు మందులు అందిస్తున్న సిబ్బంది

కేశంపేట: మండలంలోని కొత్తపేటలో వన్‌ఎస్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో జనని మాత శిశు ఆస్పత్రి ఆధ్వర్యంలో శిశు ఉచిత వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ కమ్మేకర్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలోని 70 మంది చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, నరేష్‌యాదవ్, యాదయ్య, కృష్ణ, కుమార్, బాలయ్య, అంజనేయులు, వన్‌ఎస్ ఆర్గనైజేషన్ సభ్యులు రవితేజ పాల్గొన్నారు.

సమావేశ భవన నిర్మాణం పూర్తి చేయండి

చేవెళ్ల: మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు సంబంధించిన సమావేశ భవనానికి నిధులు మంజూరు చేయాలని అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ .. అంగన్‌వాడీ టీచర్లు సెక్టార్, ప్రాజెక్టు సమావేశాలు నిర్వహించుకోవటానికి భవనం లేక పక్కనే ఉన్న బాలిక వసతి గృహంలో ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నెల సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గతంలో సమావేశ భవన నిర్మాణానికి కొన్ని నిధులు మంజూరైన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని చెప్పారు. నిధులు మంజూరు చేసి భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ చేవెళ్ల డివిజన్ కన్వీనర్, అంగన్‌వాడీ చేవెళ్ల, ఆలూరు సెక్టార్ అధ్యక్షురాళ్లు ఉమారాణి, లక్ష్మి, ప్రవీణ, భారతి, సునీత, తదితరులు పాల్గొన్నారు.


సమాజసేవకు కృషి చేయాలి

యూత్ కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌యాదవ్

మొయినాబాద్‌రూరల్: సమాజ సేవలో పాలుపంచుకున్నప్పుడే ప్రజలు గుర్తిస్తారని నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, బాకారం ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం బాకారంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వైకుంఠరథాన్ని నిర్మించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైకుంఠరథాన్ని అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనప్పుడే ప్రజలు గుర్తిస్తారన్నారు. గ్రామాల్లో వైకుంఠధామాలు దూరంగా ఉండడం వల్ల ఈ వైకుంఠ రథం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు వైకుంఠ రథాన్ని అవసరం వచ్చినప్పుడు వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరినాథ్, మాజీ ఉపసర్పంచ్ నారాయణపురం కరుణాకర్ ముదిరాజ్, మాజీవార్డు సభ్యులు సదానందం, వార్డు సభ్యులు నారాయణపురం మహేందర్, పంచలింగాల శ్రీనివాస్‌రెడ్డి, సిరిగిరి శ్రీనివాస్, పాల్గొన్నారు.

తక్కువ విత్తనం.. ఎక్కువ విస్తీర్ణంలో సాగు

- ఆరోగ్యకరమైన నారుతో అధిక దిగుబడులు
- నర్సరీల్లో పెంచిన నారుతో ఎక్కువ లాభాలు



నాగర్‌గూడలో నర్సరీలో ఆరోగ్యంగా పెరుగుతున్న కూరగాయల నారు

షాబాద్: ఎండకాలంలో నాణ్యమైన, ఆరోగ్యకరమైన నారును పెంచాలంటే చాలా కష్టం. నారు పెంచే సమయంలో ఎక్కువగా వర్షం కురిసినా, ఎండలు ఎక్కువగా ఉన్నా మొలకెత్తిన నారు చనిపోతుంది. పోసిన నారులో సగానికి సగం చనిపోతుంది. దీంతో అనుకున్న స్థాయిలో పంటను నాటుకోలేక రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పుడు అలాంటి నష్టాలు లేకుండా ఆరోగ్యకరమైన నారు అందించి అటు ఆర్థికంగా నష్టపోకుండా ఇటు కాలం కలిసి వచ్చే విధంగా నర్సరీలు నారును పెంచి రైతన్నలకు అందజేస్తున్నాయి. తక్కువ ఖర్చుతో రైతులకు సకాలంలో ఆరోగ్యకరమైన నారు (మొక్కలు)ను పెంచి అందించేందుకు మండలంలోని నాగరగూడలో 15 ప్రైవేట్ నర్సరీ కేంద్రాలు నెలకొన్నాయి. ఈ సంస్థలు నర్సరీలో రైతుకు ఆరోగ్యకరమైన మొక్కలను పెంచి అందిస్తుంది. నాగరగూడ చుట్టు పక్కల గ్రామాల కూరగాయల రైతులు తాము సాగుచేసే కూరగాయల నారును నర్సరీ నుంచే తీసుకుంటున్నారు. సాగు చేసే పంట విత్తనాలు రైతు ఇచ్చిన , లేక రైతు చెప్పిన రకాన్ని నర్సరీ నిర్వాహకులు తెచ్చి పెంచి ఇస్తున్నారు. కానీ, విత్తనం ఇస్తే రేటు తగ్గిస్తారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన నారు సకాలంలో అందించడంతో రైతులు స్వతహాగా నారుమళ్లు ఏర్పాటు చేసుకోవడం తగ్గించారు. సంవత్సర పొడవునా టమాట, వంకాయ, మిర్చి, కాలీఫ్లవర్, క్యాబేజీ కూరగాయల నారు, బంతి, చామంతి తదితర పూల నారులతో నర్సరీ కళకళలాడుతూ కనిపిస్తుంది.

నర్సరీలో పెంచిన నారుకు తెగుళ్లు రావు..

విత్తనం శుద్ధి చేసి వైరస్‌లు సోకకుండా ప్రత్యేకంగా తయారు చేసిన షెడ్డులో నారు పెంచుతారు. ఎప్పటికప్పుడు నారు పరిశీలిస్తూ కావల్సిన పోషకాలు అందించడంతో తక్కువ సమయంలో నారు ఏత దశకు వస్తుంది. పంట పొలంలో మొక్క నాటిన అనంతరం కూడా ఆరోగ్యంగా పెరిగి తొందరగా పంట చేతికి రావడంతో పాటు, అధిక దిగుబడులు వస్తాయి.

విత్తనం వృథా కాదు..

ఒక్కొక్క విత్తనం ట్రేలో జాగ్రత్తగా నాటడంలో ప్రతి విత్తనం మొలకెత్తి ఆరోగ్యంగా పెరుగుతుంది. సాధారణ స్థాయిలో రైతులు ఏర్పాటు చేసే నారు మళ్లలో ఎకరా టమాట సాగుకు 80గ్రాముల నుంచి 100గ్రాముల వరకు అవసరం అయితే, అదే నర్సరీలో ఎకరాకు 30గ్రాముల టమాట విత్తనం సరిపోతుంది.

సమయానికి నారు సిద్ధం

రైతులు విత్తనం ఇచ్చిన సమయం నుంచి టమాట 40నుంచి 50 రోజులు, వంకాయ 40నుంచి45 రోజులు, మిర్చి 35నుంచి 40రోజులు, క్యాలీఫ్లవర్, క్యాబేజీలు 30నుంచి 35రోజుల్లో రైతుకు ఏతకు వచ్చిన నారు సిద్ధంగా ఉంటుంది.

"సేంద్రియ ఎరువులతో నారు పెంచుతున్నాం..



సేంద్రీయ ఎరువులతో నారును పెంచుతున్నాం, అందువల్ల నాణ్యమైన నారును పొందడానికి వీలుంటుంది. రైతులు ఎక్కువగా నారును కొనుగోలు చేస్తున్నారు. టమాట, వంకాయ, కాలీఫ్లవర్ నార్లు 40పైసాల నుంచి రూపాయి వరకు విక్రయిస్తున్నాం. మిర్చి నారు 80పైసలనుంచి ఒక రూపాయి వరకు విక్రయిస్తున్నాం. నర్సరీలో అయితే ఎండ పడకుండా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు.

– అమత్‌రాజు, నర్సరీ నిర్వాహకుడు, సర్దార్‌నగర్

నర్సరీలో నారు ఆరోగ్యంగా ఉంటుంది..



నర్సరీలో నారు ఆరోగ్యంగా ఉంటుంది. పంట పొలాల్లో నారు పోస్తే చలి, వానకు సక్రమంగా మొలకెత్తడం లేదు. విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక ఉష్ణోగ్రత ఉంటే నారు చనిపోతుంది. సాధారణంగా రైతుల పొలాల్లో నారు పెంచే సమయంలో ఇలాగే నష్టపోతున్నారు. చీడపీడల బెడద కూడా ఎక్కువే. నర్సరీలో అయితే ఎండపడకుండా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తారు. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు. దీంతో నారు ఆరోగ్యంగా ఉంటుంది.

– యాదవరెడ్డి రైతు, బొబ్బిలిగామ

మాతృభాషపై పట్టు సాధించాలి

న్యాయవాది సబియా సుల్తానా



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సబియా సుల్తానా

షాద్‌నగర్: ప్రతి ఒక్కరు మాతృభాషపై పట్టు సాధించాలని న్యాయవాది సబియా సుల్తానా అన్నారు. పట్టణంలోని మాలిక్ మజీద్ ఎడ్యుకేషన్ కేంద్రంలో ఆలియా సుల్తానా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉర్దూ, అరబ్బీపై శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులను శనివారం న్యాయవాది సబియా సుల్తానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మనస్సులోని భావాన్ని బయటకి వ్యక్తం చేయడమే భాష అని అన్నారు. మాతృభాషను మించింది మరొకటి లేదని, ప్రతి ఒక్కరు మాతృభాషను గౌరవించి పట్టు సాధించాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు అరబ్బీ, ఉర్దూ భాషల్లో శిక్షణ పొందితే జీవితం సార్థకమవుతుందని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదువుల్లో రాణించాలని చెప్పారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు 40రోజుల పాటు శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుండడం హర్షనీయమన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ, జెడ్పీటీసీ మాలతి తదితరులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని దామరగిద్దలో సర్పంచ్ మలిపెద్ది వెంకటేశంగుప్తా ఆధ్వర్యంలో 4వ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే , ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువతలోని క్రీడప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడుతాయని చెప్పారు. ప్రతి ఏడాది టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్న సర్పంచ్ వెంకటేశంగుప్తాను అభినందించారు. ఆయా గ్రామాల్లోని యువత ఆసక్తిని బట్టి క్రీడాపోటీలను నిర్వహించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలోని యువత అన్ని రంగాల్లో రాణించే సత్తా ఉందని చెప్పారు. కానీ, వారి ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి వేదికలు చాలా అవసరమని తెలిపారు. పోటీల ద్వారా వారిలోని ప్రతిభ బయటకు రావడంతో పాటు ఇంకా మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే, సర్పంచ్ వెంకటేశంగుప్తా మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాలీబాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 కట్టి జట్లు వారి పేర్లు నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ పోటీలకు వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. భోజన వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్, నాగార్జున్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, రవి, గని, గ్రామ పెద్దలు, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాములు, ఆర్గనైజర్స్ అనిల్‌కుమార్, రాజు, సామేల్, రవి, సిమోన్, మహేందర్, వెంకటేశ్ ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



చిన్నారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్ల పాటు చదువులు పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారుల చదువుల పట్ల ప్రభుత్వం ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి వారిని ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే పౌష్టికాహారంతో పాటు ఆట, పాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయాల నిధులు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన వంటగ్యాస్ సిలిండర్లను సిబ్బందికి అందజేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, జెడ్పీటీసీలు ఎమ్మె శ్రీలత, విశాల, వైస్‌చైర్మన్ రవీందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, రవినాయక్, వెంకటేశ్, యాదయ్య, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: మే 1వ తేదీన 137వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. రామస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మికులకు పలు చట్టాలు, హక్కులు వచ్చాయని చెప్పారు. అందుకే మే 1వ తేదీన అంతర్జాతీయ కార్మికుల దినోత్సవ వేడుకలను జరుపుకొంటున్నట్లు తెలిపారు. ఈ మే డేనే కార్మికులు, కర్షకులు, రైతులు, కూలీలు, కష్టజీవులు అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. కార్మికులకు మేడేనాడు సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, నియోజకవర్గ కో కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మండల కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి, మండల అధ్యక్షుడు శివ, బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మహిళా నాయకురాళ్లు ఉన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

షాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు శనివారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరవధిక సమ్మె రెండవ రోజుకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగేళ్ల ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆశ్రిత, గౌరిసింధు, నాగశ్రీ, అరుణ, చంద్రకాంత్, యాదిగిరి, హాజీమ్, మహేందర్‌రెడ్డి, యాదయ్య, కరుణాకర్, విజయభాస్కర్, వివకుమార్, మల్లేష్, రమేష్, ప్రవీణ్, పరమేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

పీసీసీ కార్యదర్శి శంకర్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని చించోడ్‌లో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నేరుగా ప్రజలను కలుసుకొని కష్టాలను తెలుసుకున్నారు. గ్రామ ముఖ్యకూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు పనిముట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, పెట్టుబడి సాయం ఎకరాకు రూ 15వేలు, భూమిలేని రైతు కూలీలకు ఏడాదికి రూ12 వేలు, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటుగా రైతు బీమా ఇస్తామని తెలిపారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని, దళిత, గిరిజనులకు ఇచ్చిన భూములకు హక్కులు కల్పిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి చివరి ఎకరా వరకు సాగు నీటిని అందిస్తామని అన్నారు. బీజెపి ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని మండిపడ్డారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ఎరువుల ధరలను పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లాశ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, సుదర్శన్, కృష్ణ, శ్రీశైలం, శేఖర్, బసప్ప, మల్లారెడ్డి, శ్రీనునాయక్, బుచ్చయ్య, స్వాములయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓటమే లక్ష్యంగా ఇంటింటికి సీపీఐ



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన సీపీఐ నాయకులు

చేవెళ్ల: అదానీ, అంబానీ గ్రూపుల ఆస్తులను కాపాడడానికి కాపలాగా ప్రధాని నరేంద్రమోదీ ఉన్నాడని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. మండలకేంద్రంలో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సీపీఐ ఇంటింటి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మోడీ హఠావో దేశ్‌కో బచావో' అనే నినాదంతో సీపీఐ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుందని తెలిపారు. భారత దేశ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టే ఒక కార్పొరేట్ దోపిడీదారు మోదీని విమర్శించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు సీపీఐ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీ మూతపడడం లేదా అమ్మడం జరుగుతుందన్నారు. ఎన్నికల హామీలను, విభజన హామీలను అమలు చేయని నరేంద్రమోదీని ఇంటకి సాగనంపాలని అన్నారు. మండలంలోని గుండాల, అల్లవాడ, జాలగూడ, దామరగిద్ద ఊరేళ్ల, దేవునిఎర్రవల్లి, కమ్మెట, ఎన్కేపల్లి రామన్నగూడ, ఇబ్రహీంపల్లి, రామన్నగూడ గ్రామాల్లో ప్రజాపోరు జాత సాగిందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, కోకన్వీనర్ ప్రభులింగం, గోపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మొయినాబాద్ మండల కార్యదర్శి కె. శ్రీనివాస్, శంకర్‌పల్లి కార్యదర్శి సుధీర్, షాబాద్ ఎస్. జంగయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన

పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి



మాట్లాడుతున్న పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి

షాబాద్: ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై అందించే గొర్రెలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని మండల పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుమ్మరిగూడ, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో గొల్ల, కురుమ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం సబ్సిడీపై అందించే గొర్రెలకు లబ్ధిదారుడు రూ.43,500 చెల్లిస్తే మిగతాది ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఒక్కొక్క లబ్ధిదారుడికి 20 గొర్రెలు, ఒక పొట్టేలును ప్రభుత్వం ఇస్తుందన్నారు. లబ్ధిదారుడి బ్యాంకు ఖాతా నుంచి నేరుగా డబ్బులను కలెక్టర్ ఖాతాకు జమ చేయాలని సూచించారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, కులం, ధ్రువపత్రాల జిరాక్స్ ఖాతా పుస్తకం, కులం ధ్రువ పత్రాల జిరాక్స్ కాపీలను సంఘం అధ్యక్షులకు గానీ, మండల పశు వైద్యశాలల్లో అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు కేతన రమేష్‌యాదవ్, చందిప్ప జంగయ్య, గొల్ల, కురుమ సంఘం నాయకులు తదితరులున్నారు.

అవినీతిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలి

పీడీఎస్‌యూ నేత జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్



రాజేశ్

చేవెళ్ల: తెలంగాణ యూనివర్సిటీలో గత కొన్ని నెలలుగా అక్రమ నియామకాలు చేస్తూ, కొట్లాది రూపాయలు దండుకున్న యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రవీందర్‌గుప్తాపై సమగ్ర విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నిస్తున్న పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా బోధన, బోధనేతర ఉద్యోగ నియామకాలు చేపడుతూ, నిధులను ఇష్టం వచ్చినట్లుగా దుర్వినియోగం చేస్తున్న వైస్ చాన్స్‌లర్ రవీందర్ గుప్తా, రిజిస్ట్రార్ విద్యవర్ధినిలపై విచారణ జరిపించి బర్తరఫ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌ను తక్షణమే ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు. ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను భర్తీ చేసి యూనివర్సిటీని అభివృద్ధి చేయాలన్నారు. అక్రమంగా అరెస్టులు చేసిన పీడీఎస్‌యూ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మండల అభివృద్ధికి నిరంతర కృషి

జెడ్పీటీసీ శ్రీలత



సర్పంచులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ

కొత్తూరు: మండల అభివృద్ధికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో నిరంతరంగా కృషి చేస్తానని జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని అయా గ్రామాలకు మంజూరైన జెడ్పీ నిధులు రూ. 55లక్షల ప్రొసీడింగ్స్‌ను ఆమె శనివారం ఎమ్మెల్యే సమక్షంలో సర్పంచులకు అందజేశారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతోనే మండలానికి పెద్దమొత్తంలో నిధులు మంజూరైనట్లు వివరించారు. సిద్ధాపూర్‌లో మహిళ సమైఖ్య భవనానికి రూ.10 లక్షలు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి రూ.4లక్షలు, కొడిచర్లలో సీసీరోడ్డుకు రూ.5లక్షలు, కొడిచర్లతండాలో డ్వాక్రా భవన నిర్మాణానికి రూ.10 లక్షలు పెంజర్లలో సీసీరోడ్డుకు రూ.6లక్షలు, ఎస్‌బీపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 లక్షలు, సీసీరోడ్డుకు రూ.5లక్షలు, గూడూరులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు రూ. 5లక్షలు మంజూరు కాగా వాటికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఆయా గ్రామాల సర్పంచులకు అందజేశారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం పట్ల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శోభా, సర్పంచులు సంతోష్‌నాయక్, తులసమ్మ, సత్తయ్య, అజయ్‌నాయక్, నాయకులు కృష్ణయాదవ్, ఎమ్మె సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.